# దొంగ చేతికి తాళాలు

రాజయ్య వయసులో వుండగా వ్యాపారం చేసి బాగానే సంపాదించాడు. ముగ్గురు కొడుకులకు చదువు చెప్పించాడు. వాళ్ళు నగరంలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. పెళ్ళిళ్ళు చేసుకుని హాయిగా వున్నారు. అయినా వారికి తండ్రి సంపాదించిన ఆస్తి పంచుకోవాలని ఉబలాట పడిపోయారు. తండ్రిని తమ దగ్గర వుండమని కోరారు. రాజయ్య వృద్ధుడయ్యాడు. భార్య చనిపోయింది. అయినా ఆస్తి కొడుకులకు పంచి ఇవ్వడానికి గాని, తను కొడుకుల దగ్గరకు వెళ్ళి వుండడానికి గాని ఒప్పుకోలేదు. అలా చేస్తే ముందు ముందు ఏం జరుగుతుందో అతనికి తెలుసు. ఆస్తి చేతిలో లేకపోతే కొడుకులు లెక్క చెయ్యరు. కోడళ్ళు హీనంగా చూస్తారు. ఆఖరికి తనను గొడ్ల పాకలోకి నెట్టి చిప్పకూడు పెట్టినా ఆశ్చర్యం ఏమీ లేదు. అందుకే రాజయ్య ఒంటరిగా వుండిపోయాడు.

రాజయ్య దగ్గర బాగా డబ్బున్న సంగతీ, ఇంట్లో ఒంటరిగా వున్న విషయమూ తెలుసుకున్న దొంగ సింగయ్య ఒకరోజు అర్ధరాత్రి ఇంటికి కన్నం వేసి లోపలకు జొరబడ్డాడు.

రాజయ్యకి రేచీకటి. చీకటి పడితే కళ్ళు కనపడవు. అర్ధరాత్రి మెలకువ వచ్చిన రాజయ్య ఆయాసంతో ఉక్కిరిబిక్కిరై పోయాడు. బాధతో మెలికలు తిరిగిపోసాగాడు.

"దాహం... దాహం" అని అరవసాగాడు. తను ఆ ఇంట్లో ఒంటరిగా వున్న విషయమూ, తన మొర ఎవరూ ఆలకించలేరనే సంగతి మర్చే పోయాడు.

రాజయ్య అవస్థ చూసిన సింగయ్యకి జాలి కలిగింది. ఆ ముసలాయనకు సహాయం చేయాలనుకున్నాడు. అతనిలో నిద్రాణమై వున్న మానవత్వం మేలుకుంది.

కుండలో వున్న మంచి నీళ్ళు గ్లాసునిండా తీసుకుని రాజయ్యకి తాగించాడు. మంచినీళ్ళు తాగిన రాజయ్య తేరుకున్నాడు.

"నాయనా! సమయానికి దేవుడిలా వచ్చి నా దాహం తీర్చావు. నా ఆయాసానికి మందు కూడా ఇచ్చావంటే నీకు ఎంతో ఋణపడి వుంటాను" అన్నాడు రాజయ్య.

"ఆ మందు ఎక్కడుంది?" అడిగాడు సింగయ్య.

"ఆ బల్ల మీదున్న సీసాలో వుంటాయి. ఒకటి తెచ్చి ఇవ్వు" అన్నాడు రాజయ్య.

సింగయ్య సీసాలో వున్న మాత్ర తెచ్చి రాజయ్య నోట్లో వేసి నీళ్ళు తాగించాడు. కాసేప

టికి రాజయ్యకి ఆయాసం తగ్గి మామూలు మనిషయ్యాడు.

"నాయనా! నువ్వెవరివో నేను చూడ లేను. రాత్రిళ్ళు నాకు కళ్ళు కని పించవు. ఏమీ అనుకోకు అన్నాడు రాజయ్య.



"అయ్యో! అదేమిటి స్వామీ! కళ్ళు కని పించకపోతే దానికి మీరేం చేస్తారు".

"ఇంతకీ నువ్వెవరు? ఎందుకొచ్చావు? లోపల గడియ పెట్టి నిద్ర పోతుంటాను. మరి నువ్వు ఇంట్లోకి ఎలా రాగలిగావు? చెప్పు?" అడిగాడు రాజయ్య.

తను ఎందుకొచ్చిందీ చెప్పడానికి సిగ్గు కలిగింది సింగయ్యకి. అందుకే ఏమీ మాట్లాడ లేకపోయాడు.

"చెప్పు! నువ్వెవరైనా నిన్ను దేవుడే పంపించా డని అనుకుంటున్నాను. లేకపోతే నాకు ఆయాసం వచ్చి ఉక్కిరిబిక్కిరై పోతున్న సమయానికి ఇంట్లోకి ఎలా రాగలిగావు? నా పాలిట దేవుడిలా వచ్చి నా నోట్లో మందు వేసి ప్రాణాలు కాపాడావు. ఏమీ అనుకోను. చెప్పు? నువ్వె వరివి? ఎందుకొచ్చావు?" రాజయ్య పదే పదే అడిగాడు. ఇక సింగయ్యకి చెప్పక తప్పిందికాదు.

"అయ్యా! నా పేరు సింగయ్య. పక్కనే వున్న వెంకటాపురం మా ఊరు. పనులున్నప్పుడు కూలి చేసి పెళ్ళాం పిల్లల్ని పోషించుకుంటున్నాను. చెయ్యడానికి పనిలేక, తినడానికి తిండి లేక మరో దారి లేక అప్పుడప్పుడూ దొంగతనం చేస్తుంటాను స్వామీ! నన్ను మన్నించండి. నేను దొంగతనం

చెయ్యాలనే మీ ఇంటికి వచ్చాను".

నిజం చెప్పాడు సింగయ్య.

"అయ్యో! పాపం, నీకు తినడానికి తిండే లేదా! ఇదుగో తాళం చేతులు తీసుకో. ఆ ఇనప్పెట్టె తెరిచి నీకు ఎంత డబ్బు కావాలో తీసుకో" అన్నాడు రాజయ్య.

రాజయ్య మంచితనానికి సింగయ్య నిలువునా కదిలిపోయాడు. దొంగ చేతికి తాళాలు ఇచ్చే వాడిని తన జీవితంలో ఎవర్నీ చూడలేదు. అందుకే సింగయ్యకి దుఃఖం ముంచుకొచ్చింది.

"అయ్యా! నాకు మీ సొమ్ము వద్దు. మీరెంతో మంచివాళ్ళు. మీ సొమ్ము తింటే పాపం చుట్టు కుంటుంది" అన్నాడు ఏడుస్తూ.

"సొమ్ము నాదైనా ఆ సొమ్ముతో నీకు అవ సరం వుంది. అదీగాక సమయానికి వచ్చి నా ప్రాణం కాపాడావు. నిన్ను ఆదుకుంటే నాకు పుణ్యం దక్కుతుంది" అన్నాడు రాజయ్య.

"అయ్యా! ఇంత మంచివారు. మీరెందుకు ఒంటరిగా దిక్కు లేకుండా పడి వున్నారు? మీకు ఆస్తిపాస్తులున్నాయి. సొమ్ముంది. సహాయం చేసే మనిషే దొరకలేదా? మీకు పిల్లలు లేరా?" అని అడిగాడు సింగయ్య.

రాజయ్య తన గురించి అంతా చెప్పాడు. "సింగయ్యా! నాకు పొలాలున్నాయి, తోట లున్నాయి, డబ్బుంది. అవన్నీ పంచుకోవాలని ఎదురుచూసే కొడుకులున్నారు. నా ఆస్తిపాస్తులు కొడుకులకిచ్చిన తర్వాత నేనూ నీలాగే తిండికి మొహం వాయాల్సి వుంటుంది. ఇటువంటి కొడుకుల కథలెన్నో లోకంలో జరుగుతున్నాయి. అందుకే నా చివరి రోజుల వరకూ ఆస్తి పంచ దల్చుకోలేదు".

"అయ్యా! ఆస్తిపాస్తుల గొడవలు నాకు అర్థం కావు. నాకు అర్థమైంది ఒకటే. మీరు దేవుడంత మంచోరు. మీకు ఎవరూ తోడు లేరు. మీకేం ఇబ్బంది లేకపోతే మీ పొలాల్లో, తోటల్లో పని చేసుకుంటూ మీ దగ్గర వుండిపోతా!" అన్నాడు సింగయ్య.

"అయ్యో! అంతకంటేనా? ఇక నుంచి నువ్వే నాకు దేవుడిచ్చిన కొడుకువి. ఈ క్షణం నుంచే నువ్వు నాకు తోడు నీడగా నా ఇంట్లో వుండి పోతున్నావు. ఇవిగో తాళాలు. నీకేం కావాలన్నా తీసుకో!" అన్నాడు రాజయ్య సింగయ్యకి బాధ్యతలు అప్పజెప్తూ.

"అయ్యా! దొంగచేతికి తాళాలు ఇస్తున్నారు" అన్నాడు సింగయ్య నవ్వుతూ.

"దొంగ దొరయ్యాడు సింగయ్యా! ఎవరూ దొంగలుగా పుట్టరు. లోకం దొంగల్ని తయారు చేస్తున్నది. ఈ లోకాన్ని పరిపాలిస్తున్న దొరల మనసులు మారితే దొంగలే వుండరు" అన్నాడు రాజయ్య.